క్లుప్తంగా

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో కోచ్ శరత్‌బాబు

తగరపువలస : జీవీఎంసీ మధురవాడ జోన్ కార్‌షెడ్ కూడలిలో ఈ నెల 2న జరిగిన అంతర రాష్ట్ర ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఆనందపురం మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 8 పతకాలు సాధించారు. విక్టరీ షోటాకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో కాటా, కుమటిలో కొత్తూరుకు చెందిన బోర లక్ష్మణరెడ్డి, గారిపేటకు చెందిన యశస్విని డబుల్ బంగారు పతకాలు సాధించారు. అలాగే ఆనందపురానికి చెందిన యశ్మిత బంగారు, కాంస్యం, నీహాల్ బంగారు, వెల్లంకికి చెందిన కృష్ణ చైతన్య బంగారు, కాంస్యం, జస్వంత్ రజతం, షణ్ముఖ కాంస్యం, కొత్తవలసకు చెందిన కుషేందర్ రజత, కాంస్యం, జీవన్ బంగారు, కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన చిన్నారులను కోచ్ శరత్‌బాబు ప్రత్యేకంగా బుధవారం అభినందించారు.

సెల్‌ఫోన్ వెలుగులో దస్త్రాల పరిశీలన



సెల్‌ఫోన్ వెలుగులో దస్త్రాలు పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

తగరపువలస: ఆనందపురం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం గంట పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో అధికారులు సెల్‌ఫోన్ వెలుగులోనే దస్త్రాలు పరిశీలించవలసి వచ్చింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడానికి కారణాలు తెలియరాలేదు. కార్యాలయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకపోవడంతోనే సెల్‌ఫోన్ వెలుగులో ముఖ్యమైన పనులు నిర్వహించినట్టు తెలిసింది.

అక్రమ నిర్మాణాలకు అడ్డా..

- జీవీఎంసీ జోన్-2లో నిబంధనలు బేఖార్
- గతంలో ప్రధాన కమిషనర్ హెచ్చరించినా మారని తీరు
- ప్రభుత్వ ఆదాయానికి కోట్ల రూపాయల గండి



మిథిలాపురి వుడా కాలనీలో ప్లాన్‌కి విరుద్ధంగా నిర్మిస్తున్న భవనం



టీడీపీ నాయకుల అనుచరులకు సంబంధించిన క్రికెట్ ప్రాక్టీస్ కోర్టు

మధురవాడ: ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా జీవీఎంసీ అధికారులకు చీమ కుట్టినట్టు అయినా లేకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మధురవాడ జోన్-2లో అక్రమ నిర్మాణాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్లానింగ్ సెక్రటరీలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, తీరు మారకపోతే చర్యలు తప్పవని కొద్ది కాలం క్రితం జీవీఎంసీ ప్రధాన కమిషనర్ స్వయంగా హెచ్చరించినా ఆ విభాగం అధికారులు, సిబ్బంది, ప్లానింగ్ సెక్రటరీల తీరు మాత్రం మారడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మధురవాడలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు పుట్టగొడు గుల్లా పుట్టుకొస్తున్నాయి. అక్రమార్కులు కనీస నిబంధనలు కూడా పాటించడంలేదు. పైగా కూటమి నాయకులు అయితే అడ్డూ అదుపూ లేకుండా వ్యవహరిస్తున్నారు. వారి అనుచరులు యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. కొందరు అక్రమాన్ని సక్రమం చేయడానికి రేట్లు కూడా నిర్ణయించినట్టు విమర్శలు గుప్పుమంటున్నాయి. కనీసం ఉన్నతాధికారులైనా దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మారికవలస జంక్షన్‌లో..

టీడీపీ మాజీ కార్పొరేటర్, అతని కుటుంబ సభ్యులు మారికవలస హైవేని ఆనుకుని కొంత ప్రభుత్వ స్థలాన్ని కలుపుకుని అక్రమ నిర్మాణం చేపట్టినా జీవీఎంసీ, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. ఈ భవనానికి ప్లాన్ కూడా పూర్తిగా లేదని కొందరు ఫిర్యాదు కూడా ఇచ్చారు. కాని అధికార పార్టీ నేత కావడంతో ఎవరూ దాని వంక చూసే ప్రయత్నం చేయలేదు. అధికారులే పట్టించుకోపోతే ఇక కింది స్థాయి సిబ్బంది పరిస్థితి వేరే చెప్పనవసరం లేదు. వారు చూపుతున్న పట్టా కూడా సక్రమంగా లేదని.. గతంలో డిప్యూటీ కలెక్టర్ల ఆదేశాల మేరకు సదరు స్థలంలో ఉన్న షెడ్‌ని కూడా తొలగించారు. ఇప్పుడు భారీ భవన నిర్మాణ పనులు చకచకా జరిగిపోతున్నాయి.



మారికవలస జంక్షన్ శారదానగర్ వద్ద కనీస నిబంధనలు పాటించకుండా నిర్మిస్తున్న భవనం



దుర్గానగర్‌లో 15 అడుగులు కూడా వెడల్పు లేని రోడ్డులో భారీ నిర్మాణం

8 అడుగుల రోడ్డులో భారీ భవనం..

జీవీఎంసీ 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీలో బేకరీ వెనుక భాగంలో కనీసం 10 అడుగులు కూడా లేని సందులాంటి రోడ్డులో భారీ భవన నిర్మాణం చకచక జరిగిపోతోంది. జీ ప్లస్ టు ప్లాన్ తీసుకుని అనుమతి లేకుండా అదనపు ఫ్లోర్ నిర్మిస్తున్నారు. దీనికి నోటీసులు కూడా ఇచ్చామని, పనులు నిలుపుదల చేశామని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సదరు సచివాలయ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్న 5 భవనాలకు నోటీసులు ఇచ్చామని ప్లానింగ్ సెక్రటరీ చెబుతున్నారు. అయితే ఒక్క దానిపై కూడా చర్యలు లేవు. వీరు నోటీసులతో మమా అనిపిస్తున్నారు.

హైవే సమీపంలోని దుర్గానగర్‌లో..

నేషనల్ హైవేని ఆనుకుని చంద్రంపాలెం దుర్గానగర్‌లో పలు విద్యా సంస్థలు, ఫంక్షన్ హాలు, ఇతర నివాస ప్రాంతాలు ఉన్నాయి. పైగా నిత్యం బిజీగా ఉండే మాస్టర్ ప్లాన్ రోడ్డు అయినప్పటికీ పాలకులు, అధికారుల ఉదాశీనత వల్ల వీధి చిన్నదిగా మారిపోయింది. ఈ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా జీవీఎంసీ అధికారులు ప్లాన్ మంజూరు చేశారు. నిర్మాణ పనుల్లో కూడా నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. అయినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల కు ఫిర్యాదు ఇవ్వడానికి స్థానికులు సిద్ధం అవుతున్నారు.

అధికార పార్టీ నాయకుడి అండతో...

ఎమ్మెల్యే ముఖ్య అనుచరుడు పేరు చెప్పి ఆటలకు శిక్షణ ఇచ్చే ప్రాక్టీసు కోర్టు పేరుతో ప్రభుత్వానికి కట్టాల్సిన లక్షలాది రూపాయల పన్ను ఎగ్గొట్టారు. వీఎల్‌టీ, ఇతర ఫీజులు ఎగ్గొట్టి అనధికార నిర్మాణం చేసేశారు. కనీస నిబంధనలు కాని, జీవీఎంసీ అనుమతి కానీ లేకుండా మాస్టర్ ప్లాన్ రోడ్డుకు కూత వేటు దూరంలో అక్రమ నిర్మాణం చేస్తున్నా ఎవ్వరూ మాట్లాడలేని పరిస్థితి. ఇటాంటివి జోన్‌లో చాలా ఉన్నాయి.

పరిశీలించి చర్యలు చేపడతాం

"అనుమతులు, నిబంధనలు లేని నిర్మాణాలపై చర్యలు తీసుకుంటాం. అటువంటి నిర్మాణాలు ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తిస్తాం. ఉల్లంఘనలు ఉంటే వెంటనే చర్యలు చేపడతాం. ఎవ్వరినీ ఉపేక్షించేది లేదు.

– తిరుపతిరావు, ఏసీపీ, జీవీఎంసీ జోన్ – 2, మధురవాడ.

మెరుగైన నైపుణ్యాలతోనే ఉపాధి

కొమ్మాది: నైపుణ్యం లేకపోతే చేతిలో డిగ్రీ పట్టా ఉన్నా ఉద్యోగాలు సాధించడం ప్రస్తుత రోజుల్లో కష్టమని గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీ భరత్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, నైపుణ్యాభివృద్ధి సంస్థ కలిసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం వేదికగా నిర్వహించిన కెరీర్ ఫెయిర్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. దేశంలో ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఏటా లక్షలాది మంది యువతీ యువకులు బయటకు వస్తున్నారన్నారు. వారిలో సరైన నైపుణ్యం లేనివారంతా నిరుద్యోగులుగా మిగిలిపోతున్నారన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి మెమో



విచారణ జరుపుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: కాపులుప్పాడ గొల్లలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు రోజు తప్పించి రోజు గుడ్లు పెడుతున్న వైనంపై 'అంగన్‌వాడీ గుడ్లు పక్కదారి' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత స్పందించారు. ఆమె బుధవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు గుడ్లు ఏవిధంగా అందిస్తున్నారనే విషయాన్ని ఆరా తీశారు. మంగళవారం ఉదయం 11 గంటలు దాటినా పిల్లలకు ఎందుకు గుడ్లు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుడ్లు ఇవ్వలేదని ఒప్పుకోవడంతో సిబ్బంది కె.వెంకటలక్ష్మి, అప్పలకొండకు ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీదేవి ఆదేశాల మేరకు మెమో జారీ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని, సమయపాలన, మెనూ ప్రకారం ఆహారం అందించడం, పిల్లల సంరక్షణ విషయంలో ఏ చిన్న తప్పు జరిగినా క్షమించేది లేదని హెచ్చరించారు.

రామాయణంలో కీలక ఘట్టం ఇంద్రజిత్తు మరణం

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



రామాయణ ఘట్టాలు వినిపిస్తున్న బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మధురవాడ: ఇంద్రజిత్తు మరణం రామాయణంలో అత్యంత కీలకమైన మలుపు అని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచించారు. మధురవాడ గాయిత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ రామాయణ ప్రవచనంలో భాగంగా బుధవారం యుద్ధ కాండలోని ఇంద్రజిత్తు వధ, రామ రావణ సంగ్రామం గురించి వీనుల విందుగా ప్రవచించారు. ఈ సందర్భంగా ఆయన ప్రవచనను కొనసాగిస్తూ రామ రావణ యుద్ధం వంటి గొప్ప యుద్ధం మరొకటి ఉండదన్నారు. శ్రీరాముడు, పరమ శివుడు మాత్రమే అంత గొప్ప యుద్ధం చేయగలిగిన మహా తేజోవంతులని స్పష్టం చేశారు. బ్రహ్మశిరస్సు అనే గొప్ప అస్త్రం, గొప్ప అశ్వంతో కూడిన రథమును బ్రహ్మ వరం చేత ఇంద్రజిత్తు పొందాడన్నారు. అతను నికుంభిల హోమం చేస్తే అతడిని సంహరించడం కుదరదని, ఆ హోమాన్ని నిరోధించిన వారి చేతిలోనే అతని మరణం ఉందన్నది బ్రహ్మ వాక్కుగా విభీషణుడు తెలియజేశాడన్నారు. ఆ కార్యమునకు లక్ష్మణుడు ఉపక్రమించడం, నల్లటి మేఘంలో ఉన్న మర్రిచెట్టు వద్ద హోమం చేస్తున్న ఇంద్రజిత్తును నిందా వాక్యములు పలికి బయటికి రప్పించడం, రామాయణమునకు మూల మంత్రముగా చెప్పబడే శ్లోకంతో ఐంద్రాస్త్రమును ప్రయోగించి అతన్ని లక్ష్మణుడు సంహరించడం, రామ రావణ యుద్ధం ప్రారంభం తదితర ఘట్టాలను చాగంటి కోటేశ్వరరావు తన ప్రవచనంలో వివరించారు. నిర్వాహకులు అన్నంరాజు సత్యనారాయణ తదితరులు చాగంటిని సత్కరించారు.

జీవ వైవిధ్యంపై అవగాహన అవసరం



మొక్కలను పరిశీలిస్తున్న ఛాత్రోపాధ్యాయులు, అధ్యాపకులు

భీమునిపట్నం : జీవ వైవిధ్యం గురించి అందరూ తెలుసుకోవాలని భీమిలిలోని జిల్లా విద్య శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతికుమారి అన్నారు. విశాఖ నగరంలోని చినవాల్తేరు వద్దనున్న రాణి చంద్రమతి బయో డైవర్శిటీ పార్కును ఛాత్రోపాధ్యాయులతో కలిసి బుధవారం పరిశీలించారు. డాల్ఫిన్ నేచర్ కన్సర్వేటరీ సొసైటీ నిర్వహిస్తున్న ఈ పార్కులో రెండు వేలకుపైగా పలు రకాల మొక్కలు ఉన్నాయని, వాటిలో ఎన్నో అరుదైనవి కూడా ఉన్నాయన్నారు. అవి ఏ విధంగా మానవాళికి ఉపయోగపడతాయన్న విషయాలు తెలుసుకోవాలని సూచించారు. సొసైటీ డైరెక్టర్ రామమూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఇది ఎంతో అరుదైన పార్కు అని, ఇందులో ఉన్న విలువైన మొక్కల గురించి అందరూ తెలుసుకోవాలని సూచించారు. గత 24 సంవత్సరాలుగా వీటిని సంరక్షిస్తున్నామని, వృక్ష శాస్త్ర పరిశోధనలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఛాత్రోపాధ్యాయులు ఈ సొసైటీలో వలంటీర్లుగా చేరి జీవన వైవిధ్య రక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. అధ్యాపకులు ఎల్.సుధాకర్, జీజీఎస్ నాగేశ్వరరావు, గొట్టేటి రవి, నీలిమ, సోమయాజులు, మహాలక్ష్మి, త్రినాథరావు పాల్గొన్నారు.

వైద్య విజ్ఞానంపై గ్రామీణ వైద్యులకు అవగాహన



మాట్లాడుతున్న మహేంద్ర ఆస్పత్రి అధినేత మహేంద్రగిరి

పద్మనాభం: ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే వేగంగా నయం చేయవచ్చని విజయనగరం మహేంద్ర ఆస్పత్రి అధినేత, వైద్యుడు బి.మహేంద్రగిరి అన్నారు. మండలంలోని కృష్ణాపురంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో బుధవారం గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మూడు నెలలకు పైగా నోటిలో పుండు తగ్గక పోతే దీన్ని క్యాన్సర్‌గా గుర్తించవచ్చన్నారు. ఖైనీలు, పాన్‌పరాగ్ తినే వారికి క్యాన్సర్ వస్తుందన్నారు. ఫాస్ట్‌ఫుడ్ తిన్న వారికి, మందు తాగే వారికి, ఒత్తిడికి గురైన వారికి గ్యాస్ట్రిక్ సమస్య వస్తుందన్నారు. కడుపులో నొప్పి తగ్గకపోతే ఎపెండిక్స్‌గా పరిగణించవచ్చని తెలిపారు. గర్భిణులకు చేసే చికిత్సల గురించి అవగాహన కల్పించారు. మహేంద్రగిరి ఆస్పత్రి వైద్యుడు కె.జయశంకర కృష్ణ, గ్రామీణ వైద్యుల సంఘం విజయనగరం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి మాట్లాడారు. గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు ఆర్.అప్పారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవాలకు సదుపాయాలు కల్పించాలని వినతి



జెడ్సీ ప్రేమప్రసన్న వాణికి వినతిపత్రం అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత ఉత్సవాలు ఈనెల 27 నుంచి 30 వరకు జరగనున్న నేపథ్యంలో తగిన సదుపాయాలు కల్పించాలని ఉత్సవ కమిటీ సభ్యులు బుధవారం జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్న వాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు మాట్లాడుతూ ఉత్సవాలు జరిగే నాలుగు రోజులు పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, భక్తులకు అవసమైన మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయడంతో పాటు ఊళ్లోని ఇళ్లకు రెండు పూటలా నీటి సరఫరా జరిగేలా చూడాలని, ఇంకా అవసరమైన ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. దీనికి జెడ్సీ స్పందిస్తు అవరసమైన సదుపాయాలు, ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఇందులో కమిటీ ప్రధాన కార్యదర్శి ఎచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్య రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పాసి వినోద్‌కుమార్, కోఆర్డినేటర్ గొరపల్లి సన్యాసిరావు పాల్గొన్నారు.

చావుల మదుం రోడ్డులో దుర్వాసన



డ్రైనేజీలో పేరుకుపోయిన వ్యర్థాలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు కొత్తపేట చావుల మదుం రోడ్డులో దుర్గంధం కారణంగా స్థానికులు ముక్కు మూసుకుని ఇళ్లలో ఉండిపోతున్నారు. చిట్టివలస గణేష్ థియేటర్ నుంచి చావుల మదుం కూడలి వరకు డ్రైనేజీలు దశాబ్దాల క్రితం నిర్మించారు. ప్రస్తుతం ఈ డ్రైనేజీల వెంట అధిక సంఖ్యలో నివాసాలు కూడా వెలిశాయి. ఇప్పుడు ఉన్న జనాభా, ఇళ్లకు సరిపడా డ్రైనేజీలను ఆధునికీకరించాల్సి ఉన్నా భీమిలి మున్సిపాల్టీ జీవీఎంసీలో విలీనం అయిన నాటి నుంచి పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఈ డ్రైనేజీలు మురిగిపోతున్నాయి. పారిశుధ్య పనులు జరిగినా స్థానికులకు ప్రతిరోజూ దుర్గంధం బాధ తప్పడం లేదు. గణేష్ థియేటర్ నుంచి చావుల మదుం కూడలి వరకు డ్రైనేజీలలో పూడిక తొలగించి విస్తరిస్తే తప్ప దుర్గంధం సమస్య తీరదని స్థానికులు అంటున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న అతిథులు

పీఎం పాలెం: స్థానిక తులసీనగర్ పార్కులో గల డాక్టర్ గాదె రోశిరెడ్డి కళావేదిక వద్ద బుధవారం సాయంత్రం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం. ప్రభావతి మాట్లాడుతూ ఆధునిక ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేయాలని సూచించారు. మహిళల ప్రమేయం లేకుండా సమాజం మనుగడ సాగదన్నారు. ఇంకా కె.ద్వారకానాథ్, టి.రంగారావు, లక్ష్మీ రెడ్డి, శుభ, మహేష్, గాదె రోశిరెడ్డి తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక మహిళలను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తులసీనగర్ పార్కు వాకర్స్ అధ్యక్షుడు చందక విశ్వేశ్వరరావు, తులసీ కుమారి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

తగరపువలస : చిట్టివలస రూరల్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ గోస్తనీ ఫీడర్, తాటితూరు వాటర్ వర్క్స్ ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ అంతరాయం కారణంగా భీమిలి మండలంలోని తాటితూరు, గొల్లలపాలెం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.


10 నుంచి పాట్నూరులో పరదేశమ్మ ఉత్సవాలు

పద్మనాభం: మండలంలోని పాట్నూరులో ఈ నెల పది నుంచి 12వ తేదీ వరకు పరదేశమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. 10న తొలేళ్ల ఉత్సవం జరుగుతుంది. దీనిలో భాగంగా అమ్మవారి ప్రతిమలైన ఘటాలను గ్రామంలో ఊరేగిస్తారు. 11న రథాల ఉత్సవం, 12న ముగింపు ఉత్సవం జరుగుతాయి.

గంభీరం రిజర్వాయర్ మీదుగా రోడ్డు నిర్మాణం!

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం పంచాయతీలో బోయపాలెం మీదుగా దుక్కవానిపాలెం టోల్‌ప్లాజా వరకు రోడ్డు నిర్మాణ ప్రతిపాదనలు జోరందుకున్నాయి. ఇటీవల వీఎంఆర్‌డీఏ ఈ ప్రాంతంలో సర్వే చేసినప్పుడు కొన్ని పొరపాట్లు జరిగాయని వాటిని సరిదిద్దుతూ బుధవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు సమావేశం అయినట్టు తెలిసింది. దీనిపై గురువారం భౌతికంగా రెవెన్యూ అధికారులు మరోమారు సర్వే చేపట్టనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే గంభీరం రిజర్వాయర్‌ను ఆనుకుని దుక్కవానిపాలెం మీదుగా ఆనందపురం-పెందుర్తి వరకు ఈ రహదారి నిర్మించనున్నారు. ఈ రహదారి నిర్మిస్తే విశాఖ నుంచి వచ్చే వాహనాలు వేములవలస కూడలికి రాకుండా నేరుగా పెందుర్తి రోడ్డుకు వెళ్లిపోతాయి. దీనివల్ల 15 నుంచి 30 నిముషాల సమయం ఆదా అవుతుంది. ఇదిలా ఉంటే రిజర్వాయర్ ప్రాంతం, దుక్కవానిపాలెంలో టీడీపీ నాయకులకు ఉన్న ఎకరాల భూములకు విలువ పెంచడానికే ఈ రహదారి నిర్మాణం చేపడుతున్నట్టు కొందరు ఆరోపిస్తున్నారు.

నేడు 'విశాఖ-బ్రహ్మపూర్' రద్దు



తాటిచెట్లపాలెం : ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,7వ తేదీల్లోను, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7, 8వ తేదీల్లో రద్దయినట్లు పేర్కొన్నారు.

విశాఖపట్నం-పలాస గమ్యం కుదింపు

విశాఖపట్నం-పలాస(67289) పాసింజర్ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు(శుక్ర, ఆదివారం తప్ప) శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పలాసలో బయల్దేరాల్సిన పలాస-విశాఖపట్నం(67290) పాసింజర్ ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు (శుక్ర, ఆదివారం తప్ప) పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం నుంచి బయల్దేరుతుంది.

పారిశుధ్య పనులు నిత్యం పర్యవేక్షించాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కొమ్మాది : నగర పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తూ, పారిశుధ్య పనుల నిర్వహణను నిత్యం పర్యవేక్షించాలని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. చంద్రబాబు విశాఖ పర్యటన నేపథ్యంలో జోన్ – 2 పరిధిలోని జోడుగుళ్లపాలెం, గీతం కాలేజ్, రుషికొండ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జోడుగుళ్లపాలెం నుంచి రుషికొండ వెళ్లే మార్గంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై ఉన్న గుంతలు వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించారు. కేబుల్ వైర్ల కోసం తీసిన గోతుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, సెంటర్ మీడియన్‌లలో ఒరిగిన గ్రిల్స్‌కు మరమ్మతులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ ముగిసినందున కూడళ్లలోని నాయకుల విగ్రహాలకు ఉన్న ముసుగులు తొలగించాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఐలాండ్‌లలో, ప్రధాన జంక్షన్లలో ఉన్న మొక్కలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఎండిపోయిన మొక్కలు తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటాలని సూచించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ప్రధాన వైద్యాధికారి ఈఎన్‌వీ నరేష్‌కుమార్, పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

నేడు అనంతుని పెళ్లి రాటోత్సవం

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం అనంత పద్మనాభ స్వామి కల్యాణానికి సంబంధించి పెళ్లి రాట వేయనున్నారు. కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి 15 వరకు అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాలు జరుగుతాయి. 10న శ్రీదేవి, భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం 9.30 గంటలకు శాస్త్రోక్తంగా పెళ్లి రాట వేస్తారు. ముందుగా విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం కుంతీ మాధవ స్వామి ఆలయ గాలి గోపురరం వద్ద పెళ్లి రాట వేస్తారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయరూ..



వీధి దీపాలు ఏర్పాటు చేయాల్సిన చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క రహదారి

తగరపువలస: చిట్టివలస-గుడివాడ గోస్తనీ నది వంతెన అప్రోచ్ రోడ్డును ఆనుకుని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క మార్గంలో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ప్రాంతం గోస్తనీ నదికి, శ్మశాన వాటికకు ఆనుకుని ఉండటంతో చీకటి పడితే విషపురుగులు ఈ ప్రాంతంలో ప్రవేశిస్తున్నాయి. ఇటీవల చిట్టివలస సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహానికి మరమ్మతులు నిర్వహిస్తున్నందున అక్కడి విద్యార్థినులతో డిగ్రీ కళాశాల నిర్వహిస్తున్న భవనంలోనే తాత్కాలికంగా వసతి గృహం నిర్వహిస్తున్నారు. అలాగే వంతెన అప్రోచ్ రోడ్డును ఆనుకుని ఇటీవల పంప్‌హౌస్ ప్రాంతానికి చెందిన స్థానికులు ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఈ కూడలిలో రాత్రి 10 గంటల తర్వాత ఒంటరిగా రాకపోకలు సాగించే వారిపై దాడులు జరుగుతున్నందున వీధిదీపాల ఏర్పాటు ఆవశ్యకత గురించి స్థానికులు గట్టిగా చెబుతున్నారు. జీవీఎంసీ సిబ్బంది పరిశీలించి ఈ ప్రాంతంలో అదనంగా వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.